# బొడ్రాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# 'మోదీ నీకెందుకింత అక్కసు'

మొన్నటికి మొన్న 'అమృత్ కాల్' పేరుతో పార్లమెంట్ అత్యవసర సమావేశాలు ఏర్పాటు చేసి తెలంగాణపై ప్రధాని నరేంద్ర మోదీ అక్కసు వెళ్లగక్కారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రాన్ని నిందిస్తూ పార్లమెంట్ సాక్షిగా మాట్లాడటం మోదీకి కొత్తకాదు. అయినా తెలంగాణ ఏర్పాటు,అస్తిత్వంపై అవమానకర వ్యాఖ్యలు చేయడం రాజనీతిజ్ఞత అనిపించుకోదు. ప్రధాని గతంలో కూడా తల్లిని చంపి బిడ్డను బతికించారని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై అసూయ వెళ్లగక్కారు.



ఒక్క ఓటు రెండు రాష్ట్రాలు అని నాడు బీజేపీ చేసిన కాకినాడ తీర్మానం మరిచి పోయినట్టున్నారు. తెలంగాణ ఉద్యమం గురించి, రాష్ట్ర ఏర్పాటు కోసం సాగిన సుదీర్ఘ చర్చల ప్రక్రియ గురించి మోదీకి అవగాహన లేకపోతే ఆ పార్టీ సీనియర్ సభ్యులను ఎవరినైనా అడిగి తెలుసుకుంటే బాగుండేది. ఈ ఏడ్పులు, పెడబొబ్బలు ఉండేవి కాదు. బీజేపీ వాలకం చూస్తుంటే తెలంగాణ ఏర్పాటు కాదన్న ఉద్దేశంతోనే, రాజకీయ లబ్ధి కోసమే రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు ఇచ్చినట్టుంది. అందుకే నీతిమాలిన మాటలకు తెగపడ్తున్నది. బీజేపీలో నాటి ప్రతిపక్ష నేత సుష్మాస్వరాజ్ లేనిలోటు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. కనీస విషయ పరిజ్ఞానం లేకుండా ఆంధ్ర లాబీ చేసిన ఆరోపణలనే ఉటంకించి, సమైక్యవాదులను భుజానేసుకొని తెలంగాణ సమాజాన్ని గాయపరచడం మోదీకి అలవాటుగా మారింది. పార్లమెంట్ తలుపులు మూసి ఏపీ విభజన చట్టాన్ని ఆమోదించారని చెప్పే ప్రధానికి అప్పుడు బీజేపీ సభ్యులు ఎందుకు మౌనం వహించారో తెలియదా? నోరున్నోడిదే రాజ్యమన్నట్టు నోటి కి ఏది తోస్తే అది మాట్లాడటం పరిపాటైంది. కానీ అది ఎల్లకాలం నడవదనేది నిర్వివాదాంశం.

బీజేపీకి ప్రత్యామ్నాయంగా బీఆర్ఎస్‌కు దేశవ్యాప్తంగా వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక 'ప్రశ్నించే గొంతుక' కేసీఆర్‌పై దిగజారి ఎదురుదాడి చేస్తున్నారు. మోదీ ఎలా డిక్టేట్ చేస్తే అలా రాజ్యం నడవాలనేది ఆయన సిద్ధాంతం. 60 ఏండ్లు ఉద్యమించి తెచ్చుకున్న తెలంగాణపై దిగజారి మోకాలికి, బోడిగుండుకు ముడిపెట్టినట్టు కేసీఆర్‌ను కించపర్చి మాట్లాడటం ఆయన అవగాహనా రాహిత్యానికి నిదర్శనం. ఎన్డీఏతో ఉన్నంతకాలం రాచరికపు వ్యవస్థ కన్పించదు. వారు బయటకు వెళ్లగానే రాజులు, రాణులంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరిన మోదీ తీరును జనం ఈసడించుకుంటున్నారు.

నా కుటుంబ సభ్యులారా.. అంటూనే కూటమిలో ఉన్న శిరోమణి అకాలీదళ్, పీడీఎఫ్, శివసేన, టీడీపీ, జేడీయూలను తిమింగలంలా మింగేప్రయత్నం చేసింది బీజేపీ. అందుకే వారంతా ఎన్డీఏకు దూరమయ్యారు. అటువంటిది కేసీఆర్ ఎన్డీఏలో చేరే ప్రయత్నం ఎందుకు చేస్తారు? దేశంలో సమైక్య స్ఫూర్తిని దెబ్బతీస్తూ, వ్యక్తుల మధ్య విష బీజాలు నాటే ప్రయత్నం అడుగడుగునా చేస్తున్నది మోదీనే కదా? గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో నాలుగు సీట్లు రాగానే తెలంగాణలో అధికారం కోసం కలలు కని ఏకంగా ఎమ్మెల్యేలకు బేరం బెట్టి బజారు పాలై ప్రజల్లో ద్రోహులుగా మిగిలిపోయారు. దీంతో కేసీఆర్ కుటుంబంపై అక్కసు పెంచుకొని గవర్నర్ వ్యవస్థను అడ్డుపెట్టుకొని తెలంగాణ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారు. దశాబ్దాల తరబడి ఎదుర్కొన్న అవమానాలను భరించలేక ఉద్యమించి సాధించుకున్న తెలంగాణపై అత్యున్నత పదవిలో ఉండి అబద్ధాలకు తెరలేపడం మోదీ కుసంస్కారాన్ని బట్ట బయలుజేసింది. చతికిలబడ్డ బీజేపీని లేపడానికి బీఆర్ఎస్‌ను ప్రజాక్షేత్రంలో ద్రోహిగా నిలబెట్టే ప్రయత్నం చేయడం మోదీ దిగజారుడు తనానికి నిదర్శనం.

విభజన చట్టంలోని కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వకుండా, బయ్యారం ఉక్కు పరిశ్రమ స్థాపించకుండా పాలమూరు-రంగారెడ్డి లాంటి గొప్ప ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వకుండా వివక్ష కనబరుస్తున్నది కేంద్రం. తొమ్మిదేండ్లుగా ఆర్థిక ఆంక్షల పేరుతో అభివృద్ధిని అడ్డుకున్నా సీఎం కేసీఆర్ జడవలేదు. అభివృద్ధిలో దేశానికే తలమానికంగా నిలిపారు.

తెలంగాణ శాసనసభలో 90 శాతం బలమున్న బీఆర్ఎస్‌లో కేటీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయడానికి కేసీఆర్ మోదీని అడగాల్సిన అవసరం ఎందుకొస్తదో ప్రజలే ఆలోచించాలి. ఎన్నికలు వచ్చినప్పుడల్లా నయానో భయానో లొంగని బీజేపీయేతర ముఖ్యమంత్రులను అవినీతిపరులుగా చిత్రీకరించడం ఆయనకు కొత్తకాదు. ఢిల్లీ, పశ్చిమబెంగాల్, ఒడిశా, కర్ణాటక ఇలా అనేక రాష్ట్రాలపై బురదచల్లడం తెలియనిది కాదు.

ఇప్పటికే ఉత్తరాదిన సన్నగిల్లిన మోదీ గాలితో దక్షిణాదిన పాగా వేయాలనే కలలకు కర్ణాటక ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారు. దీంతో మతితప్పిన మోదీ అబద్ధాలకు తెరలేపి కేసీఆర్‌పై ఆరోపణలు చేయడాన్ని తెలంగాణ సమాజం జీర్ణించుకోవడం లేదు. తనను గౌరవించలేదని మాట్లాడే మోదీ హైదరాబాద్‌కు వచ్చినప్పుడు సీఎం కలుస్తానంటే నిరాకరించినప్పుడు ఈ గౌరవం గుర్తుకు రాలేదా?

కాంగ్రెస్ 91సార్లు తిట్టింది అంటాడు కానీ, అంతకంటే ఎక్కువ సార్లు తెలంగాణను ఆడి పోసుకున్నది మోదీనే. గోబెల్స్ ప్రచారానికి దిగిన ప్రధాని మోదీకి చైతన్యవంతమైన తెలంగాణ ప్రజలు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడం ఖాయం. దేశంలో బీజేపీయేతర, కాంగ్రెసేతర ప్రత్యామ్నాయ వేదిక అధికారంలోకి వస్తుందనటంలో సందేహం లేదు.



డాక్టర్ సంగని మల్లేశ్వర్
98662 55355

## నా కుటుంబ సభ్యులారా...!!

దొంగిలించారు
ఎవరో దొంగిలించారు!
మన ఆలోచనల్నీ
మన బుర్రలను కూడా
మన స్పందనలనీ
మన భావోద్వేగాలను కూడా

మన నడకల్నీ
మన దారులను కూడా
మన కలలనీ
మన నిద్దురను కూడా
మన భావప్రకటననీ
మన స్వరపేటికలను కూడా

మన నిబద్ధతల్నీ
మన వ్యక్తిత్వాలను కూడా
మన స్వేచ్ఛనీ
మన ప్రాథమిక హక్కులను కూడా

మన మేధావులనీ
మన మేధను కూడా
మన ఉనికినీ
మన ఆవాసములను కూడా

మన భక్తినీ
మన దేవుళ్ళను కూడా
మన ఆత్మవిశ్వాసాలనూ
మన జీవితాలను కూడా

ఎవరో దొంగిలించారు!
ఎవరో దొంగిలించారు!



రవి కిషోర్ పెంట్రాల
లాంగ్లీ, లండన్!

# ఆరోగ్య భారతాన్ని నిర్మిద్దాం

ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో, ప్రస్తుతం మహారాష్ట్రలోని నాందేడ్, థానే వంటి పట్టణాల ప్రభుత్వ దవాఖానల్లో పదుల సంఖ్యలో ప్రజలు మృత్యువాత పడ్డారు. ఇది దేశంలో ప్రభుత్వ వైద్యరంగం ఎంత బలహీనంగా ఉన్నదో తెలియజేస్తున్నది. కరోనా కాలంలో కూడా దేశవ్యాప్తంగా ప్రభుత్వ వైద్యం నాసిరకంగా ఉందనే విషయం బహిర్గతమైనా, అటు కేంద్ర ప్రభుత్వం గానీ, ఇటు వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు కానీ వైద్యరంగానికి సరైన ప్రాధాన్యం ఇవ్వ లేదు. నిధులు, మౌలిక సదుపాయాలు, సరిపడా డాక్టర్లు, నర్సులు, మందులు సమకూర్చకపోవడంతో వందల సంఖ్యలో రోగుల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి.

ఏ దేశమైనా అభివృద్ధి సాధించాలంటే విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రపంచ దేశాలన్ని గుర్తించాయి. ఆ దిశలోనే ముందుకుసాగుతున్నాయి. కానీ, మన దేశంలో మాత్రం పాలకులు ఓట్లు దండుకునే పథకాలకే ప్రాధాన్యం ఇవ్వటం గమనార్హం. ప్రపంచంలో నెదర్లాండ్స్, బ్రిటన్, జర్మనీ వంటి దేశాల్లో ప్రభుత్వ వైద్యరంగం బలంగా ఉన్నది. హెల్త్ ఇన్సూరెన్స్ ద్వారా ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నాయి. దీనికి తోడు, నార్డిక్ దేశాలు మానవాభివృద్ధి సూచికల్లో గత దశాబ్ద కాలంగా ముందు వరుసలో ఉండటానికి ప్రధాన కారణం విద్య వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇవ్వడమే అని తేటతెల్లమైంది.



ఇటీవల తెలంగాణ రాష్ట్రం జిల్లాకో వైద్య కళాశాల, అర్బన్ క్లినిక్స్ వంటి సౌకర్యాలతో ముందుకుపోతున్నది. దీనికి విరుద్ధంగా కేంద్రం దేశంలో విద్య, వైద్యరంగాల్లో భారీ ఎత్తున కార్పొరేట్లను ప్రవేశపెట్టి ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్నది. దీంతో దేశంలో పేదలకు ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వైద్యం, వసతులు, మందులు దొరక్క మృత్యువాత పడుతున్నారు. ఆయుష్మాన్ భవ వంటి పథకాలు అమలు చేస్తున్నా, పేదలకు, బడుగు బలహీన, గిరిజనులకు వై ద్యం అందుబాటులో లేక, వ్యాధులు సోకినప్పుడు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.

నేటికీ అనేక గిరిజన ప్రాంతాల్లో, మారుమూల గ్రామాల్లో సరైన రహదారులు, ప్రయాణ సౌకర్యాలు లేకపోవడంతో జోలీల్లో రోగులను, గర్భిణీ స్త్రీలను మోసుకు పోతున్న సంఘటనలు చూస్తున్నాం. కొన్ని సమయాల్లో మధ్యలోనే ప్రసవాలు జరగటం, ప్రాణాలు పోవడం సర్వసాధారణమైపోయింది.

75 ఏండ్ల స్వతంత్ర భారత్‌లో మనం సాధించిన ప్రగతిని ఒకసారి విశ్లేషణ చేసుకోవాలి. దేశ ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం, తిండి, గుడ్డ, గూడు సమకూర్చడం లో పాలకులు సాధించిన ప్రగతిని ప్రజల ముందుంచాలి. లోపాలు సరిచేసుకుంటూ ముందుకు సాగాలి... అంతేగానీ, ఎన్నికల ముందు ధరలు తగ్గించడం, కొత్త కొత్త పథకాలు ప్రకటించి ప్రజలను మోసం చేయటం మానుకోవాలి. కార్పొరేట్ వ్యక్తులకు ప్రోత్సాహం పేరుతో భారీ ఎత్తున రాయితీలు ఇవ్వడం మానుకోవాలి.

ప్రస్తుతం దేశంలో ప్రజలకు సరిపడా వైద్యులు, నర్సులు, దవాఖానలు, మందులున్నాయా? ఇంకా ఎంతఅవసరం బేరీజు వేసుకుని భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలు సిద్ధం చేసుకుని, ప్రజల ప్రాణాలను కాపాడాలి. వైద్య కళాశాలల సంఖ్య పెంచాలి. తక్కువ ఖర్చుతో కూడిన మందుల ఉత్పత్తి చేపట్టాలి. ముఖ్యంగా మౌలిక సదుపాయాలు కల్పించాలి.

పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. కాలుష్య నియంత్రణ చేపట్టాలి. స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు మొక్కుబడిగా చేపట్టరాదు. వైద్య సిబ్బందికి తగు శిక్షణ, ఆధునిక సౌకర్యాలు సమకూర్చాలి. ముఖ్యంగా మానవ వనరుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. పారా మెడికల్ సిబ్బంది, ఆశా వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికుల నియామకాలు భారీ ఎత్తున చేపట్టాలి. ముఖ్యంగా అన్ని కేటగిరీల ఉద్యోగ, కార్మికులకు నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేయాలి. సీజనల్ వ్యాధులపై ముందుగా అవగాహన, చైతన్యం కలిగించాలి. ఈగలు, దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలి. మురుగు కాల్వలు తరచూ శుభ్రం చేయాలి. డ్రైనేజీ నీరు, వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలి. ప్రజలు కూడా తమ తమ పరిసరాల్లో, పనిచేసే ప్రాంతాల్లో పరిశుభ్రతకు అందరూ కలిసి కృషిచేయాలి. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య రంగంలో ప్రైవేటీకరణకు స్వస్తి పలకాలి. బడ్జెట్‌లో నిధులు ఎక్కువగా కేటాయించి, ఖర్చుచేయాలి. వైద్య పరిశోధనకు, రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్‌కు బడ్జెట్‌లో నిధులు పెంచాలి. ఫార్మా స్యూటికల్ కంపెనీలకు అవసరమైన ముడి సరుకు ఇక్కడే తయారు చేసుకునే విధానాలు రూపొందించుకోవాలి. ప్రజలందరికీ ఆరోగ్యం గురించి అవగాహన కల్పించాలి. దేశంలో చాలా మంది ప్రజలు తమ తమ ఆదాయంలో ఎక్కువ భాగం వైద్యం కోసం ఖర్చుచేయడం వల్ల వారి వారి ఆర్థిక పరిస్థితి క్షీణించి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. దేశం వెనుకబడి పోతున్నది. ఆరోగ్య భారత్ ద్వారానే భారత్ సుస్థిరాభివృద్ధి సాధిస్తుందని ఇకనైనా పాలకులు గుర్తించి, తగిన రీతిలో భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించి, అమలు చేయాలని కోరుకుందాం.



రావుశ్రీ
63056 82733




# ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ @ తెలంగాణ

ఒకప్పుడు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అంటే మన రాష్ట్రంలో హైదరాబాద్ మాత్రమే. ఇక దేశవ్యాప్తంగా చూసుకుంటే బెంగళూరు, పుణె, ముంబై, చెన్నై, కొచ్చి నగరాలు మాత్రమే. అంటే ప్రధాన నగరాలకు మాత్రమే ఐటీ పరిమితమైంది. కానీ ఇప్పుడు తెలంగాణలో పరిస్థితి మారింది. మారుమూల పట్టణాలకు కూడా ఐటీ విస్తరించింది.

హైదరాబాద్ నగరానికి అవతల ఖమ్మం, వరంగల్, నల్లగొండ, మహబూబ్‌నగర్, సిద్దిపేట, కరీంనగర్ వంటి ప్రాంతాలకు కూడా ఐటీ విస్తరించింది.. వాస్తవానికి ఐటీ కంపెనీలు రావాలంటే రోడ్లు బాగుండాలి. విద్యుత్తు సౌకర్యం మెరుగ్గా ఉండాలి. అన్నింటికి మించి ప్రభుత్వ సహకారం ఉండాలి.

తెలంగాణ రాష్ట్రంలో గడచిన పదేండ్లలో ఐటీ రంగం నలుదిశలా విస్తరించింది. 'రోబోక్సా' అనే సింగపూర్ కు చెందిన ఐటీ కంపెనీ సూర్యాపేట జిల్లాలోని కోదాడలో తన యూనిట్ ఏర్పాటు చేసుకున్నది. మొన్నీమధ్య కోదాడకు వెళ్ళినప్పుడు అక్కడ ఆ సంస్థ కార్యకలాపాలు చూసి, అక్కడి స్థానిక యువత ఉద్యోగాలు చేయడం చూసి మనసు గర్వంతో ఉప్పొంగింది. దేని కోసమైతే ఉద్యమించామో అవి సాకారమవుతుంటే ఆనందంతో కంట నీరు ఉబికి వస్తున్నది. ఇక మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లిలో 'సనాతన అనలిటిక్స్' అనే ఐటీ కంపెనీ విజయవంతంగా నడుస్తున్నది. ఇదొక ఈ కామర్స్ యాప్. దానికి ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా పదివేల మంది వినియోగదారులున్నారు. ఈ కంపెనీలో 86 మంది ఐటీ నిపుణులు పనిచేస్తున్నారు. అంతేకాదు, ఢిల్లీకి చెందిన ఓ కంపెనీకి ఈ సనాతన అనలిటిక్స్ కంపెనీ మంచిర్యాల నుంచి బిజినెస్ స్ట్రాటజీ సొల్యూషన్స్ అందిస్తున్నది. ఇక్కడ మాత్రమే కాదు ఉమ్మడి వరంగల్ జిల్లా పరకాలలో నాలుగేండ్ల కిందట 'డీజీ యోధ' అనే కంపెనీ ప్రారంభమైంది. ఈ సంస్థ 200 మంది ఉద్యోగులతో 500 సంస్థలకు సేవలందిస్తున్నది. ఇవే కాకుండా సిద్దిపేట, మహబూబ్‌నగర్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం ప్రాంతాల్లో కేటీఆర్ ప్రారంభించిన ఐటీ టవర్లు మరింత ఉత్సాహంగా పనిచేస్తున్నాయి.

వాస్తవానికి ఐటీ అంటే పదేండ్ల కిందటి వరకు మన మదిలో మెట్రో నగరాలు మాత్రమే మెదిలేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితికి తెలంగాణ ప్రభుత్వం చరమగీతం పాడింది. జిల్లా కేంద్రాల్లోనూ సకల సౌకర్యాలు కల్పించింది. ఫలితంగా ఐటీ కంపెనీలు ద్వితీయ శ్రేణి నగరాల్లో ఏర్పాటవుతున్నాయి. అక్కడి స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. ఒకప్పుడు గూగుల్, మైక్రోసాఫ్ట్ కంపెనీలు తమ శాఖలను ఏర్పాటు చేసుకునేందుకు హైదరాబాద్ సురక్షితమైన ప్రాంతం అనుకునేవి. కానీ మెయిన్ బ్రాంచ్‌గా, స్టార్టప్ క్యాపిటల్‌గా హైదరాబాద్‌ను మార్చిన ఘనత ముమ్మాటికి తెలంగాణ ప్రభుత్వానిదే. ప్రపంచంలోని 14 దేశాల నుంచి దాదాపు 1000 స్టార్టప్ ఐడియాలు వస్తే.. అందులోని 68 ఐడియాలు ఎంపికయ్యాయి. ఈ జాబితాలో తెలంగాణ నుంచి 13 కంపెనీలు ఉండటం విశేషం. హైదరాబాదులో 1998లో మాదాపూర్ ప్రాంతంలో హైటెక్ సిటీ ప్రారంభమైంది. కానీ అప్పటికంటే ఇప్పుడు ఐటీ మరింత అభివృద్ధి చెందింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల ఫేస్‌బుక్, అమెజాన్, యాపిల్, గూగుల్, ఓలా, వన్ ప్లస్, ఒప్పో, మైక్రాన్ వంటి కంపెనీలు రూ. 23 వేల కోట్లు పెట్టుబడి పెట్టాయంటే మామూలు విషయం కాదు.

ఐటీ రంగం అభివృద్ధి కోసం కేటీఆర్ చేసిన వరుస విదేశీ పర్యటనలు తెలంగాణ రాష్ట్రానికి ఎంతో లబ్ధి చేకూర్చాయి. అంతర్జాతీయ స్థాయి సంస్థలు భారీగా పెట్టుబడులు పెట్టాయి. కంపెనీల అవసరాలకు అనుగుణంగా 11 పారిశ్రామిక వాడలను ఐటీ పార్కులుగా మార్చేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకున్నది. టైర్ 2, టైర్ 4 పట్టణాలకు ఐటీ రంగాన్ని విస్తరించడం వల్ల.. గ్రామీణ ప్రాంతాల్లో ఐఐటీ రంగాల వారికి ఉపాధి లభిస్తున్నది. దీనికి తోడు గ్రామీణ తెలంగాణలో అద్భుతాలు చేసేందుకు ఐటీ రంగ నిపుణులు చాలా ఉత్సాహం చూపిస్తున్నారు. దీనికి ప్రభుత్వం అండదండలు అందిస్తుండటంతో వినూత్న ఆలోచనలు చేస్తున్నారు. టీ హబ్, టీ వర్క్స్ వంటి వాటిల్లో తెలంగాణ గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన వారే సత్తా చూపిస్తున్నారు. అనితర సాధ్యమైన విజయాలు సాధిస్తూ తెలంగాణ పౌరుషాన్ని చాటుతున్నారు.. ఈ పదేండ్ల కాలంలో తెలంగాణ ఐటీ రంగం ఎంత అభివృద్ధి చెందిందంటే.. ఒకసారి మాదాపూర్, నెక్ నాం పూర, హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట ప్రాంతాలను చూస్తే తెలుస్తుంది. జిల్లా కేంద్రాల్లో ఏర్పాటైన ఐటీ కంపెనీల వల్ల ఎకనామికల్ గ్రోత్ పెరిగింది. అక్కడ ఉండే స్థలాలకు డిమాండ్ పెరిగింది. ఫలితంగా రిజిస్ట్రేషన్ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. అంతేకాదు అక్కడున్న స్థానికులకు కూడా ఉపాధి లభిస్తున్నది. మలక్‌పేట వంటి ప్రాంతంలో ప్రభుత్వం ఐటీ పార్కు కోసం ప్రయత్నాలు చేస్తున్నదంటే,ఐటీ విస్తరణ మీద ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు.



డా॥ కేసగాని రాజశేఖర్‌గౌడ్
98484 80890
(వ్యాసకర్త: ప్రభుత్వ వైద్యులు, ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి)

# మైనారిటీల ప్రగతి ప్రదాత కేసీఆర్



75 ఏండ్ల స్వతంత్ర భారతావనిలో ఇప్పటికీ పేదరికంలో మగ్గుతున్న వారెవరైనా ఉన్నారంటే వారు మైనారిటీలుగా ఉన్న ముస్లింలే. కనీస విద్య అందక, ఉపాధి మార్గాలు లేక ఇంకా వారు పేదలుగానే ఉన్నారు. సెక్యులరిజం పేరుతో దేశంలోని రాజకీయ పార్టీలన్నీ మైనారిటీలను వాడుకుంటూ మోసగిస్తూ వచ్చాయి తప్ప ఏ పార్టీ, ఏ ప్రభుత్వమూ ఆదుకొన్నది లేదు. ఆ పార్టీలు ముస్లింలను కేవలం ఓటుబ్యాంకు గానే చూశాయి. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు దాటినా మైనారిటీల బతుకులు మారలేదు.

మన దేశానికి మొదటి విద్యాశాఖ మంత్రి అయిన మౌలానా అబుల్ కలాం..దేశంలో విద్యావ్యవస్థ అవసరాన్ని గుర్తించి, గుణాత్మక విద్య ఆవశ్యకతను నొక్కి చెప్పారు. కేవలం విద్య ద్వారానే పేదరికం తొలగిపోతుందని బలంగా విశ్వసించిన మౌలానా, ఆరు నుంచి 14 ఏండ్ల వయసు వరకు పిల్లలకు ఉచి త, నిర్బంధ విద్యను అందించేందుకు కృషిచేశారు. ప్రతి ఒక్కరూ ప్రాథమిక విద్యను పొందడం జన్మహక్కుగా పరిగణించాలని చాటి చెప్పారు. మౌలానా మార్గదర్శకత్వంలో విశ్వవిద్యాలయాల గ్రాంట్ కమిషన్ (యూజీసీ)ని విద్యా మంత్రిత్వశాఖ 1953లో స్థాపించింది. 1951లో అబుల్ నాయకత్వంలోనే మొదటి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్థాపితమైంది. ఇలా ఈరోజు దేశంలో విద్యా ఫలాలు అందరికీ అందుతున్నాయంటే.. మైనారిటీలు కొంత చదువుకోగలిగారంటే ఆయన గొప్పతనమే.

అబుల్ కలాం ఆజాద్ ఆలోచనలకు అనుగుణంగానే ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యకు తెలంగాణలో అత్యంత ప్రాధాన్యం ఇస్తూ వెనకబడిన మైనారిటీల కోసం అనేక విద్య, సామాజిక, ఆర్థికపరమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు.. ముస్లింలకు విద్యను అందించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ 206 మైనారిటీ గురుకులాలు ఏర్పాటు చేసి, ఒక్కో విద్యార్థిపై ఏటా లక్ష రూపాయలకు పైగా ఖర్చుచేస్తూ నాణ్యమైన వసతితో కూడిన విద్యనందిస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ప్రభుత్వం మైనారిటీల అభ్యున్నతికి అనేక సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నది. షాదీముబారక్, మైనారిటీ గురుకులాలు, ఒక్కో మైనారిటీ విద్యార్థికి రూ.20 లక్షలకు పైగా ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నది. ఇమాం, మౌజంకు నెలకు రూ.10 వేల గౌరవ వేతనం, హజ్ యాత్రికులకు ఏర్పాట్లు, పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, స్వయం ఉపాధికోసం ముస్లిం మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ లాంటి కార్యక్రమాలు వారి ప్రగతికి మైలురాయిగా నిలుస్తున్నాయి. 'రంజాన్ తోఫా'తో పాటు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తూ లౌకిక స్ఫూర్తిని చాటుతున్నారు. గత తొమ్మిదేండ్లలో రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమం కోసం దాదాపు రూ.8,500 కోట్లు ఖర్చు చేసింది. మైనారిటీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి టీఎస్ ప్రైమ్‌ను తీసుకొచ్చింది. వారికి రాయితీలిస్తూ, ప్రోత్సాహకాలు కల్పిస్తున్నది. మైనారిటీ యువతకు స్వయం ఉపాధి కోసం అందించే రుణాల సబ్సిడీని 50 శాతం నుంచి 80 శాతానికి పెంచింది. విద్య, ఉపాధి, శిక్షణ లాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి రాష్ట్రవ్యాప్తంగా పదుల సంఖ్యలో షాదీఖానా కమ్ ఉర్దూ ఘర్‌లను ప్రభుత్వం నిర్మించింది. హైదరాబాద్ జామియా నిజామియా యూనివర్సిటీ అభివృద్ధికి ఏటా నిధులు కేటాయిస్తున్నది. రాష్ట్రానికి ప్రత్యేకంగా వక్ఫ్ బోర్డును ఏర్పాటు చేసింది. మైనారిటీ వర్గాల సామాజిక, ఆర్థిక జీవన స్థితిగతులపై అధ్యయనం చేసి, వారి అభివృద్ధికి సిఫారసులు చేసేందుకు మైనారిటీ కమిషన్‌ను నియమించింది. మైనారిటీల ఆర్థిక పరిస్థితిని గమనించిన సీఎం కేసీఆర్.. వారికి బీసీ కులవృత్తులను ఆదుకున్నట్టే.. మైనారిటీ బంధు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. కేసీఆర్ నిర్ణయంతో లక్షలాది మంది మైనారిటీలకు ఎంతో ఉపశమనం లభించింది. కులమతాలకతీతంగా పేదరికాన్ని తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దార్శనికతతో పనిచేస్తున్నదనడానికి ఇదే నిదర్శనం.

తెలంగాణలో తెలంగాణ ప్రాంత సంస్కృతులను, విభిన్న మత, ఆచార సంప్రదాయాలను సమానంగా ఆదరిస్తూ రాష్ట్రంలో గంగా జమునా తెహజీబ్‌ను కాపాడేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారు... అర్హులైన క్రిస్టియన్లకు క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా, అర్హులైన ముస్లిం, సిక్కు, బుద్దిస్ట్, జైన్, పార్సీ మతాలకు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా లక్ష రూపాయల సబ్సిడీని ప్రభుత్వం అందిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత మైనారిటీల విద్యా వికాసానికి, వారి సామాజిక, ఆర్థిక ప్రగతికి దోహదం చేసే అనేక పథకాలు, కార్యక్రమాలను చేపట్టి సంఘంలో ఆత్మగౌరవం, హోదా కలిగిన పౌరులుగా తీర్చిదిద్దే కార్యాచరణను ప్రభు త్వం అమలు చేస్తున్నది. సర్వధర్మ సమభావనను పాటిస్తూ, ఏ సామాజిక వర్గం పట్ల వివక్ష, విస్మరణ లేకుం డా ప్రగతి ఫలాలను అందరికీ అందజేస్తున్న సీఎం కేసీఆర్ వైపే అన్ని వర్గాల ప్రజలు ఉన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమాన్ని, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఎన్నో పథకాలను అమలు జేస్తున్నారు సీఎం కేసీఆర్..సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న విషయంలో తెలంగాణ దేశంలోనే మొద టి స్థానంలో ఉన్నది. అందుకే మరోసారి కేసీఆర్ పాలన కావాలని తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీలు ముక్తకంఠంతో కోరుకుంటున్నారు. సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధించడంలో ముస్లింల భాగస్వామ్యం కచ్చితంగా ఉంటుం ది. తెలంగాణ అభివృద్ధి చెందిన రాష్ట్రంగా కేసీఆర్ పాలనలో మరింత ప్రగతి పథంలో ముందుకుసాగాలని కోరుకుందాం.



సయ్యద్ నాజీం అహ్మద్
98484 80890